

హైడ్రా కూల్చివేతల భయం కారణంగా ఇటీవల కూకట్‌పల్లిలో ప్రాణాలు కోల్పోయిన బుచ్చమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కేటీఆర్

హైడ్రా కూల్చివేతల్లో పుస్తకాలు కోల్పోయిన చిన్నారి వేదశ్రీతో ముచ్చటిస్తున్న కేటీఆర్

..భస్మాసుర హస్తం

> హైడ్రా భయం వల్లనే బుచ్చమ్మ బలవన్మరణానికి పాల్పడింది. ఆమెది ఆత్మ హత్య కాదు.. హైడ్రా అనే అరాచక సంస్థతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేయించిన హత్య. మీ దిక్కుమాలిన చర్యల కారణంగా పేదలు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి దాపురించింది. వేదశ్రీ అనే పాప ఏడుస్తూ పుస్తకాలు తీసుకుంటామంటే కూడా తీసుకోనివ్వకుండా ఇల్లు కూలగొట్టింద్రు. ఇంత దిగజారిన, దిక్కుమాలిన చర్య మరేదైనా ఉంటదా? -కేటీఆర్

మొదటిపేజీ తరువాయి...

వైద్య పరీక్షలు చేయిస్తామని చెప్పారు.రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గుడ్డెద్దు చేలో పడ్డట్టు కూకట్‌పల్లిలోని నల్ల చెరువు వద్ద కూల్చివేతలు చేపట్టి అనేక మందిని రోడ్డును పడేసిందని మండిపడ్డారు. హైడ్రా అనే బ్లాక్ మెయిల్ సంస్థను పేదల మీదికి ఉసిగొల్పి..నోటీసులు ఇవ్వకుండానే ఇండ్లు కూలగొడుతూ భయానక వాతావరణాన్ని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిందని, కనీసం పిల్లలు పుస్తకాలను కూడా తీసుకోనీయకుండా ఇండ్లు కూలగొట్టారని నిప్పులు చెరిగారు. ఎక్కడ తమ ఇల్లు కూలగొడుతారోనన్న భయంతోనే కలత చెంది 52 ఏండ్ల బుచ్చమ్మ ఆత్మ హత్య చేసుకున్నదని, ఆమె కుటుంబాన్ని చూస్తే బాధ కలుగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే పర్మిషన్లు ఇచ్చి, పన్నులు కట్టించుకొని, నల్లా కనెక్షన్లు ఇచ్చి ఇప్పుడు అదే కాంగ్రెస్ ప్రభుత్వం కూలగొట్టడం ఎక్కడి న్యాయమని ప్రశ్నించారు.

ఇంత అమానవీయమా?

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇంత అమానవీయంగా ప్రవర్తించాల్సిన అవసరం ఉన్నదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. సర్కారు దిక్కుమాలిన చర్యలతో చివరికి ప్రజలు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. 'ఎన్నికల్లో ఎన్నో హామీలిచ్చింద్రు.. ఇందిరమ్మ ఇండ్లు కడుతం.. ఇంటి నిర్మాణానికి 5 లక్షలు ఇస్తం అన్నరు. ఒక్క ఇల్లయినా కట్టిండ్రా? ఒక్క ఇల్లు కూడా కట్టకుండానే నీ ప్రభుత్వం ఎన్ని ఇండ్లను కూలగొట్టిందో ప్రజలు గమనిస్తున్నరు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'నువ్వు వచ్చి దాదాపు ఏడాది కావచ్చింది ఒక్క ఇల్లయినా కట్టినవా?' అని రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. హైదరాబాద్‌లోనే కాకుండా ఊళ్లలోనూ రేవంత్‌రెడ్డి అరాచకం గురించి మాట్లాడుకుంటున్నారని తెలిపారు. 'నువ్వు నీ క్యాబినెట్ మంత్రులు ఏం చేస్తున్నారో ప్రజలంతా చూస్తున్నరు. గరీబోళ్ల ఇండ్లు కూలగొట్టి హైడ్రా పేరుతో దందా చేస్తున్నరు.. బుచ్చమ్మది ఆత్మహత్య కాదు? రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన హత్య.. ఈ హత్య కేసును రేవంత్‌రెడ్డి, హైడ్రా పైన పెట్టాలి' అని విరుచుకుపడ్డారు. బుచ్చమ్మ కుటంబానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆర్థిక సాయం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. హైడ్రా బాధితులందరికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు అండగా ఉంటారని, ప్రజలెవరు భయపడవద్దు అని కేటీఆర్ భరోసా కల్పించారు.

రాష్ట్రంలో అరాచక రాజ్యం

తెలంగాణ మొత్తం మీద ఇవ్వాళ అరాచకమే రాజ్యమేలుతున్నదని కేటీఆర్ ధ్వజమెత్తారు. గరీబోళ్ల పొట్టకొట్టే ప్రభుత్వ చర్యలపై పోరాడుతామని స్పష్టంచేశారు. హైదరాబాద్ ప్రజలు బీఆర్ఎస్‌కు ఓటేసినందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పగ సాధిస్తున్నదని విమర్శించారు. ఈ ప్రభుత్వం మీద అందరం కలిసి కచ్చితంగా తిరగబడాల్సిందే పిలుపునిచ్చారు. కార్యకరమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మందడి శ్రీనివాస్‌రావు, ముద్దం నర్సింహయాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీశ్‌గౌడ్ తదితరులున్నారు.

> హైడ్రాతో ఆర్థిక మంత్రికి సంబంధమేంది? ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తడు.. ఐదుగురు బిల్డర్ల పేర్లు చెప్తడు.. ఎందుకిదంత? బ్లాక్‌మెయిల్ దందానా? నీ మంత్రులు, నీ తమ్ముళ్లందరిది ఇదే దందానా? పెద్దపెద్ద బిల్డర్లను బెదిరించి వాళ్ల దగ్గర దందా చేసి చందాలు వసూలు చేసేందుకా నీ ప్రభుత్వం ఉన్నది? -కేటీఆర్

చిప్ప చేతిలో పెడితిరి : కేటీఆర్

'సంపద పెంచే ఆలోచనలు మావి.. ఉన్నది ఊడ్చే సావు తెలివితేటలు మీవి' అని కాంగ్రెస్ సర్కారు తీరుపై కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. మేము బంగారు బాతును చేతిలో పెడితే.. 11 నెలలకే చిప్పచేతిలో పెడితిరి' అంటూ నిప్పులు చెరిగారు. హైడ్రా చర్యలతో హైదరాబాద్‌లో సొంతింటి కల చెదిరిందని, మూసీ ముష్టి పనులకు రియల్ ఎస్టేట్ దివాలా తీసిందని ధ్వజమెత్తారు. నాడు నిత్యం కలకలలాడిన రిజిస్ట్రేషన్ కార్యాలయాలు నేడు విలవిలలాడుతున్నాయని పేర్కొన్నారు.

చిన్నారి ఆవేదనకు చలించి..

'మా ఇల్లు రేవంత్ సార్ కూలగొట్టారు.. మా ఇల్లు మొత్తం కూల్చేశారు.. మేం ఏడుస్తున్నా వదలలేదు. టీచర్ వాళ్లు కాల్ చేసి స్కూల్‌కు ఎందుకు రాలేదని అడిగితే మా ఇంటిని కూలగొడితే బుక్స్ అన్నీ పోయినయ్ అని చెప్పిన. మా బుక్స్, వాటర్ బాటిల్స్, ఏమేం పోయినయివో.. ఆ రేవంత్‌రెడ్డి సారు ఏమేం తీసుకున్నడో.. అవన్నీ మాకు కంపల్సరీ తెప్పియాలి. మా డాడీ డీమార్ట్‌లో బాటిల్ కొనిపిస్తే అది కూడా పగులగొట్టిండ్రు.. మా మమ్మీడాడీ పెట్రోల్ పోసుకుంటే చాన బాధవడ్డ' అంటూ తన ఇంటిని కూల్చిన సందర్భంలో చిన్నారి వేదశ్రీ ఆవేదనతో చెప్పిన మాటలు సామాజిక మాధ్యమాల్లో వైరలై ప్రతి ఒక్కరి గుండెను కరిగించాయి. ఆ చిన్నారి గోడును విన్న కేటీఆర్, ఆమె కుటుంబాన్ని పరామర్శించేందుకు సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కలిసి ఆమె ఇంటికి వెళ్లారు. సున్నం చెరువు పరీవాహక ప్రాంతాల్లో హైడ్రా బాధితుల ఇండ్లకు వెళ్లి పరిస్థితులను తెలుసుకున్నారు. చిన్నారి వేదశ్రీ మీడియా చానల్‌లో తన గోడు వెలిబుచ్చిన తీరు తనను కలిచివేసిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. వేదశ్రీని ఎత్తుకొని కాసేపు ముచ్చటించారు. పుస్తకాలు కోల్పోయిన వేదశ్రీకి పుస్తకాలతో పాటు బ్యాగు అందించారు. వారి కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. హైడ్రా కూల్చివేతల కారణంగా తమ పిల్లలు, కుటుంబం మొత్తం రోడ్డున పడిందని కేటీఆర్‌కు వేదశ్రీ కుటుంబ సభ్యులు రోదిస్తూ తెలిపారు. వేదశ్రీ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

రాక్షసక్రీడలు మానండి

రాజకీయాలపై పెట్టిన దృష్టి ధాన్యం కొనుగోళ్లపై ఎందుకు పెట్టడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు.రాజకీయాల్లో రాక్షస క్రీడలు మాని రైతులను ఆదుకోవడంపై దృష్టి పెట్టాలని, రైతుల విషయంలో రాజకీయాలు చేయొద్దని హితవుపలికారు. దసరాకే కాదు దీపావళికి కూడా రైతులను దివాలా తీయిస్తారా? అని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి ధాన్యం మూలుగుతున్నా ఎందుకు కొనడం లేదని నిలదీశారు. దొరికినకాడికి దోచుకో.. అందినంత దండుకో అన్నట్టుగా రాష్ట్రంలో ప్రస్తుతం దందా నడుస్తున్నదని కేటీఆర్ ఎద్దేవాచేశారు. 'అక్రమార్కులు, కాంగ్రెస్ గ్యాంగ్‌లు సహజ వనరులను కొల్లగొడుతున్నారు. సీక్రెట్ ఒప్పందాలు చేసుకొని యథేచ్ఛగా ఇసుక, మట్టిని బుక్కేస్తున్నారు. ఇసుకాసుర, బకాసుర భస్మాసుర రాజ్యం ఇది' అని తీవ్రంగా మండిపడ్డారు.

> ఈ రాష్ట్రంలో పేదోళ్ల ఇండ్లు కూలగొట్టేందుకే చట్టాలున్నాయా? రేవంత్‌రెడ్డీ.. ఎఫ్టీఎల్‌లో ఉన్న నీ అన్న తిరుపతిరెడ్డికి ఇంటికి నోటీసులు ఇస్తవు.. పేదలకు ఇవ్వవా? ఏక పక్షంగా కూలగొడుతరా? ఇదెక్కడి న్యాయం? - కేటీఆర్

లోకం పోకడ



ఏం బాంబులు అంకుల్ మీవి?
చెత్తగా వున్నాయ్.. ఒక్కటీ పేలడం లేదు!

సచ్చిన నా తమ్ముడు లేచి వస్తడా?

ఆపదలున్నప్పుడు పోలీసోళ్లు పట్టించుకోలేదు
ఇప్పుడు 60 మంది ఏం చేయవచ్చిన్రు
మేం ఓట్లు వేస్తేనే రేవంత్‌రెడ్డి సీఎం అయిండు
శ్రీధర్‌బాబు ఎదుట గంగారెడ్డి అక్క రాధ ఆగ్రహం

జగిత్యాల రూరల్, అక్టోబర్ 28: 'మా తమ్ముడు ఆపదల ఉన్నప్పుడు పోలీసోళ్లకు చెప్పినా పట్టించుకోలేదు. ఇవాళ మీ వెంట 60 మంది పోలీసోళ్లు ఏం జేయ వచ్చిన్రు? సచ్చిపోయిన నా తమ్ముడు ఇప్పుడు లేచి వస్తడా..' అని మంత్రి శ్రీధర్ బాబును సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మారు గంగారెడ్డి అక్క రాధ నిలదీశారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాకూర్‌తో కలిసి సోమవారం రాత్రి ఆయన జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌లో గంగారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించగా, ఆమె ఇలా స్పందించారు. 'మేమంతా ఓట్లు వేస్తేనే రేవంత్‌రెడ్డి సీఎం అయిండు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నా తమ్ముడు హత్యకు గురైండు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మా తమ్ముడి హత్యకు పోలీసోళ్ల వైఫల్యమే కారణం' అంటూ ఆరోపించారు. అంతలోనే కుటుంబసభ్యులు కలుగజేసుకొని, ఆమెను మాట్లాడవద్దని సూచించారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు గంగారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. హత్య వెనుక రాజకీయ కారణం ఉన్నదా అని కుటుంబసభ్యులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సందేహం వ్యక్తం చేయడంతో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డీజీపీ, ఎస్పీలతో మాట్లాడామని చెప్పారు.

మంత్రి పొంగులేటి జన్మదినం సందర్భంగా రామారంలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఎండలో కూర్చున్న విద్యార్థులు

పాఠశాలలో పొంగులేటి జన్మదిన వేడుకలు

విద్యార్థులను ఎండలో కూర్చోబెట్టి ఫొటోలు

రామవరం/కొత్తగూడెం క్లైం, అక్టోబర్ 28 : రాజకీయాలకు అతీతంగా ఉండే పాఠశాలల్లోనూ పొలిటీషియన్ల పుట్టినరోజు వేడుకలు జరిపి చిన్నారులను ఇబ్బంది పెడుతున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం ట్రైబుల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో సోమవారం 'హ్యాపీ బర్త్‌డే టు పొంగులేటి శ్రీనన్న' అనే అక్షరాల ఆకారంలో కూర్చోబెట్టి ఫొటోలు తీసుకున్నారు. ఇందుకోసం సుమారు మూడు నుంచి నాలుగు గంటలు విద్యార్థులను ఎండలో కూర్చోబెట్టారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యక్తి పూజ చేసే చర్యలు మంచివి కావని బీఆర్ఎస్వీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఇందుకు ప్రోత్సహించిన వారిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ నాగేంద్రమ్మను వివరణ కోరగా.. తాను కొత్తగా విధుల్లో చేరానని, ఎవరో వైస్ ప్రిన్సిపాల్‌ను అడిగితే పర్మిషన్ ఇచ్చారని, అది కూడా తమ గ్రౌండ్ పరిధిలోనే చేశామని, ఇక నుంచి అలా జరుగకుండా చూసుకుంటామని తెలిపారు. అలాగే పొంగులేటి జన్మదినాన్ని పురస్కరించుకొని కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఆయన అనుచరులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. జాతీయ రహదారిపై ఎడ్లబండ్లు, వాహనాలతో పెద్దఎత్తున ర్యాలీలు నిర్వహించారు. దీంతో సుమారు గంటసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు.

పేదలపై జులుం.. పెద్దోళ్లకు సలాం

మొదటిపేజీ తరువాయి...

మహా నగరంలో హైడ్రా సృష్టిస్తున్న బీభత్సం సామాన్యుల్లో వణుకు పుట్టిస్తున్నది. నగరంలో ఒక ఇల్లు ఉండాలనే ఆశ, సామాజిక భద్రతతో లక్షలు వెచ్చించి మరికొన్ని లక్షలు బ్యాంకు రుణాలు తీసుకొని ఇల్లు నిర్మించుకుంటాడు. అలాంటిది హైడ్రా పేరుతో ప్రభుత్వం రాత్రికి రాత్రి వాటిని నేలమట్టం చేయడంతో అనేక కుటుంబాలు వీధినపడుతున్నాయి. ఈ క్రమంలో హైడ్రా ఏర్పాటు కంటే ముందు నుంచి ఇప్పటివరకు ఆ విభాగం 23 చోట్ల ఏకంగా 262 నిర్మాణాలను నేలమట్టం చేసింది. ఇందులో ఒకటీ, అరా మినహాయిస్తే అన్నీ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన నిర్మాణాలే. ఈ నేపథ్యంలో తాము బడా బాబుల అక్రమ నిర్మాణాలను సైతం కూల్చివేస్తామని, అందుకు సంబంధించి పెద్ద ఎత్తున కసరత్తు జరుగుతున్నదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పలు మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలు, మీడియా సమావేశాల్లో వెల్లడించారు. అయితే, కొన్నిరోజుల కిందట హైడ్రాకు పూర్తిస్థాయి అధికారాలు వచ్చాయి. కానీ, స్థానిక సంస్థలే అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇవ్వడం, హైడ్రా రంగంలోకి దిగి కూల్చివేయడం జరిగింది. ఇప్పటివరకు హైడ్రా కూల్చివేసిన 23 చోట్ల కూడా సంబంధిత స్థానిక సంస్థలే నోటీసులు జారీ చేశాయి.

ఐదు బడా నిర్మాణ సంస్థలకు నోటీసులు

హైడ్రా కమిషనర్ రంగనాథ్ గతంలో చెప్పినట్టుగానే బడా నిర్మాణ సంస్థలకు చెందిన అక్రమ నిర్మాణాలను కూడా కూల్చివేసేందుకు కసరత్తు జరుగుతున్నదనేది అక్షర సత్యం. ఐదు బడా నిర్మాణ సంస్థలకు నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. అందులో భాగంగానే బాచుపల్లిలోని కోమటికుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మితమవుతున్న వాసవి అర్బన్ ప్రాజెక్టుకు నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ నోటీసులు ఇచ్చింది. మున్సిపల్ అధికారులు ప్రాజెక్టు పనుల వద్దకు వెళ్లి పరిశీలించారు. మరోవైపు హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లో కోమటికుంట చెరువు (ఐడీ నంబరు-2822)ను పరిశీలించినా ప్రాజెక్టులోని 8, 9 బ్లాకులు (17"32'17.690N-78"22'59.602E) ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తున్నట్టు స్పష్టంగా తెలుస్తున్నది. బఫర్‌జోన్‌ను పరిగణలోనికి తీసుకుంటే మరికొన్ని బ్లాకులు కూడా అందులోకి వస్తాయి. వాసవితో పాటు అపర్ణ, ఆదిత్య, వర్టెక్స్, జయభేరి నిర్మాణ సంస్థలకు కూడా ఆయా స్థానిక సంస్థలు నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. కానీ ఈ నాలుగు ప్రాజెక్టుల వద్దకు కూడా ఇప్పటివరకు హైడ్రా వెళ్లలేదు. సంబంధిత అధికారులు ఆయా ప్రాజెక్టుల వద్దకు వెళ్లి ఎఫ్‌టీఎల్ మార్కింగ్ కూడా చేయలేదు.

తెర వెనక మతలబు?

హైడ్రా ఏర్పాటు వెనక రేవంత్ ప్రభుత్వానికి రాజకీయ లక్ష్యం ఉందని, నిర్మాణ సంస్థలు, బిల్డర్ల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసేందుకే దీనిని ఉపయోగించుకుంటున్నారని బీఆర్ఎస్ ఆది నుంచి ఆరోపిస్తున్నది. ఇప్పుడు ఈ నిర్మాణ సంస్థల విషయంలో అదే రుజువైంది. ఈ ఐదు నిర్మాణ సంస్థలకు గత నెల 15-18 తేదీల్లో ఆయా స్థానిక సంస్థలు నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. అందులో 15 రోజుల గడువు ఇచ్చారు. గడువు ముగిసి 15 రోజులకు పైనే అవుతున్నది. కానీ, ఇప్పటివరకు ఎక్కడా ఒక్క ఇటుక కూడా కూల్చివేసిన దాఖలాలు లేవు. కనీసం ఆయా సంస్థలు హైడ్రాకు గానీ, సంబంధిత స్థానిక సంస్థలకుగానీ వివరణ ఇచ్చిన దాఖలాలు కూడా లేవు. అయినప్పటికీ సామాన్యుడి ఇండ్లను కూల్చివేసిన హైడ్రా వీరి జోలికి మాత్రం వెళ్లలేదు. ఇందుకు తెర వెనక జరిగిన మంతనాలే కారణంగా తెలిసింది. ఆయా సంస్థలు ప్రభుత్వ పెద్దలను కలిసి 'సంతృప్తి'పరచడంతో నోటీసులు అటకెక్కినట్టు చెప్తున్నారు.

మీ ఇండ్లు వద్దు.. రెండు లక్షలు వద్దు

- కట్టడం పక్కన పెట్టి.. కూల్చివేతలా?
- పేదోళ్లు రోడ్డున పడటమే అభివృద్ధా?
- 6 గ్యారెంటీలని అరిగోస పెడుతున్నరు
- ఫ్రీ బస్సులు కాదు.. నీడ కల్పించండి చాలు
- మూసీ పరీవాహక బాధితుల గోడు

ఖైరతాబాద్, అక్టోబర్ 28: మీరిచ్చే ఇండ్లు వద్దు.. రెండు లక్షలూ వద్దని పలువురు మూసీ పరీవాహక ప్రాంత వాసులు స్పష్టం చేశారు. మూసీ బాధితుల హక్కుల పరిరక్షణ ఫోరం, ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఆప్ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్, ఫోరం చైర్మన్ అఫ్సాన్ సలాం, మూసీ పరీవాహక ప్రాంత బాధితులతో కలిసి మాట్లాడారు. ప్రభుత్వం పేదలకు ఇండ్లు కట్టించడం మానేసి, కూల్చివేసి వారిని రోడ్డున పడేయడమేంటని ప్రశ్నించారు. పేదలకు పూర్తిస్థాయి పునరావాసం కల్పించాకే ఇండ్లను కూల్చివేయాలని కోరారు. ఎందరో బడాబాబులు నాలాలు, చెరువులను ఆక్రమించుకొని ఇండ్లు కట్టుకుంటే ప్రభుత్వానికి కనబడడం లేదని మండిపడ్డారు. కష్టం చేసుకొని జీవిస్తున్న పేదల ఇండ్లను మూసీ సుందరీకరణ పేరిట కూల్చివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ సుందరీకరణపై తక్షణమే డీపీఆర్ రిపోర్టును విడుదల చేయాలని, బాధితులందరికీ నష్టపరిహారం, పునరావాసం, పక్కా భవనం నిర్మించిన తర్వాతే కూల్చివేతలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలా కాదని పేదలను రోడ్డుపై పడేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలువురు మూసీ పరీవాహక ప్రాంత వాసులు తమ గోడును 'నమస్తే'తో పంచుకున్నారు.

పేదల ఇండ్లే కావాల్నా?

ఊహ తెలిసినప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నం. ఈ ఇంట్లోనే మూడుతరాలుగా ఉంటున్నది. కష్టపడి కట్టుకున్న ఇంటిని వదిలి డబుల్ బెడ్రూంలోకి పొమ్మంటున్నరు. ప్రభుత్వం మంచి ఇల్లు ఇచ్చి అప్పుడు కూల్చివేయాలి. మాది పెద్ద కుటుంబం. ఆ డబుల్ బెడ్రూంలో కొడుకులు, కోడళ్లు, మనుమండ్లు, మనమరాండ్లతో ఎలా ఉండాలె. ఈ సర్కారుకు పేదలకు ఇండ్లు కట్టడం చేతగాదని అర్థమైంది. బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన డబుల్ బెడ్రూం ఇండ్లనే పంచి, మేం ఇస్తున్నమని చెప్పుకుంటున్నది.

-అనురాధ, కేటీఆర్ కాలనీ, రామంతాపూర్

ఏడికి పోవాల్నో.. ఏం చేయాల్నో..

నా భర్తకు రెండు కిడ్నీలు ఖరాబైనయ్. గుండె సమస్య కూడా ఉంది. పూర్తిగా మంచం పట్టిండు. మాకు ఒక పాప, బాబు. ఎల్బీనగర్‌లో ఓ ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్న. నెలకు వచ్చే రూ.10వేలతోనే నా ఇల్లు గడుస్తున్నది. ఇప్పుడు నీడగా ఉన్న ఈ ఒక్క ఇంటిని కూడా కూల్చివేస్తమంటున్నరు. గిట్లయితే ఎట్ల బతకాలె. ఏం చేయాలె. మా ఇంటికి మార్కింగ్ చేసినప్పటి నుంచి పెద్ద రంది పట్టుకున్నది.

-ఈ. జయ, కేటీఆర్‌నగర్, రామంతాపూర్

కబ్జా కాదు.. పక్కా పట్టాభూమి

నా భర్త క్యాబ్ డ్రైవర్. పైసా పైసా కూడబెట్టుకొని ఇల్లు కట్టుకున్నం. మేమేదో కబ్జా చేసిన ఇల్లు అన్నట్టుగా అధికారులు ప్రవర్తిస్తున్నరు. ఇది పక్కా పట్టా భూమి. ఏటా అన్ని పన్నులు కడుతున్నం. బఫర్‌జోన్‌లో ఉంటే, ఇన్నేళ్లు ప్రభుత్వం మా దగ్గర పన్నులెందుకు తీసుకున్నది. నోటీసులు కూడా ఇవ్వకుండా మార్కింగ్ చేసిన్రు. ఏ టైములో బుల్డోజర్ వచ్చి మా బతుకులను ఆగం చేస్తదో అని కంటి మీద నిద్ర కూడా కరువైంది. రెండు లక్షలు వద్దు.. మా ఇండ్లు మాకు ఉంటే చాలు. ఆరు గ్యారెంటీలని చెప్పి అరిగోస పెడుతున్నరు.

-పద్మ, కేటీఆర్‌నగర్, రామంతాపూర్

డబుల్ బెడ్రూం సరిపోదు..

ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తమని చెప్పి, ఉన్న ఇంటిని కూల్చివేస్తున్నరు. 70 గజాల స్థలంలో కష్టపడి ఇల్లు కట్టుకున్నం. మాకు నీడ లేకుండా చేస్తున్నరు. మా ఇల్లు కూల్చకుండానే అభివృద్ధి చేయలేరా? పేదలకు మంచి చేసుడు పక్కనబెట్టి, ఉన్న ఇంటిని కూడా లేకుండా చేస్తున్నరు. బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టించిన ఇండ్లలోకి పొమ్మంటున్నరు. మాది పెద్ద కుటుంబం. అది మాకు సరిపోదు. మంచి చేయకున్నా సరేగాని ఇట్ల చెడు చేసుడు ఎందుకు?

-నీల, కేటీఆర్‌నగర్, రామంతాపూర్

ఇద్దరు పిల్లలతో ఏడికి పోవాలె..

నా భర్త సెంట్రింగ్ కార్మికుడు. మాకు ఇద్దరు పిల్లలు. వచ్చే డబ్బులు మా కుటుంబ పోషణకే సరిపోవడం లేదు. ఉన్న ఒక్క ఇంటిని కాంగ్రెస్ ప్రభుత్వం లాక్కుంటానంటున్నది. పేదోళ్లు రోడ్డు మీద పడుడే అభివృద్ధా? డబుల్ బెడ్రూం ఎక్కడిస్తరో చెప్పడం లేదు. నోటీసులు ఇవ్వకుండానే మార్కింగ్ చేసి వెళ్లింద్రు. ఖాళీ చేయమని బెదిరిస్తున్నరు. ఇద్దరు పిల్లలతో ఏడికి పోవాలె. ఎట్ల బతకాలె. ఈ ప్రభుత్వం ఇట్ల చేస్తదని అనుకోలే.

-వీ. భాగ్యలక్ష్మి

నేషనల్ ఉత్తమ మహిళా సమాఖ్యగా 'ఎల్కతుర్తి'

ఎల్కతుర్తి, అక్టోబర్ 28: జాతీయ స్థాయిలో ఉత్తమ మహిళా సమాఖ్యగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల సమాఖ్య ఎంపికైంది. ఏపీఎంఏఎస్ (ఆంధ్రప్రదేశ్ మహిళాభివృద్ధి సంస్థ), ఎస్‌బీఐ, ఇతర ఏజన్సీల మద్దతుతో ఏటా ఉత్తమ పనితీరు కనబర్చిన ఎస్‌హెచ్‌జీ (స్వయం సహాయక సంఘాలు)లకు ఈ అవార్డులను అందిస్తున్నారు. ఏపీఎంఏఎస్ ఎస్‌హెచ్‌జీల పనితీరుపై నవంబర్ 21, 22 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న జాతీయ సదస్సుల్లోనే అవార్డులను అందిస్తారు. జాతీయ స్థాయిలో ఉత్తమ మహిళా సమాఖ్యగా ఎల్కతుర్తి ఎంపికవడంపై ఐకేపీ రవీందర్ హర్షం వ్యక్తంచేశారు.

హైడ్రా ఎఫెక్ట్.. 800 కోట్ల నష్టం!

- 3 నెలలుగా భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్లు
- కూల్చివేతలతో కొనుగోలుదారుల్లో భయం
- రిజిస్ట్రేషన్లకు ముందుకు రాని బిల్డర్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరానికి హైడ్రా ఫీవర్ పట్టుకుంది. మూడు పూలు ఆరు కాయలుగా సాగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారినికి హైడ్రా ప్రాణ సంకటంగా మారింది. చెరువుల సంరక్షణ పేరిట ఓ వైపు కాంగ్రెస్ సర్కార్ పేదల ఇండ్లపైకి బల్డోజర్లను నడుపుతుండగా.. మరోవైపు రాష్ట్ర ఖజానాను నింపే రెవెన్యూ చక్రం నిలిచిపోయింది. దీంతో మూడు నెలల వ్యవధిలో దాదాపు రూ.800 కోట్ల నష్టం వాటిల్లింది. రియల్ ఎస్టేట్‌కు స్వర్గధామంగా ఉన్న హైదరాబాద్ తన బ్రాండ్ ఇమేజ్‌ను కూడా కోల్పోయింది. భూములు, స్థిర, చర ఆస్తుల క్రయ విక్రయాల సంఖ్య తగ్గుముఖం పట్టింది.

ఏడాదిన్నరకాలంగా కుదేలైన రియల్ ఎస్టే మార్కెట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం మరింత నిర్వీర్యం చేసింది. హైడ్రా ప్రవేశంతో అంతంత మాత్రంగా సాగుతున్న ఇండ్ల క్రయవిక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ ప్రభావంపై పలు ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు తమ అధ్యయనాలను వెల్లడించాయి. ఆ నివేదికల ప్రకారం హైడ్రా పరిధియైన ఔటర్ రింగురోడ్డు లోపల గత మూడు నెలల కాలంలో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు గణనీయంగా తగ్గిపోయాయి. ఫ్లాట్లు, ఇండిపెండెంట్ల రిజిస్ట్రేషన్లు 23 శాతం తగ్గినట్టు వెల్లడించాయి.

మూడు నెలల్లో రూ.800కోట్ల నష్టం

హైడ్రా పరిధి విస్తరించి ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గుముఖం పట్టింది. అప్రకటిత కూల్చివేతలు, నిర్మాణాల తొలగింపుతో కొనుగోలుదారులు భయభ్రాంతులకు